



# కరపత్రం

SINCE 2014

సోమవారం ఏప్రిల్ 27, 2026 | సంపుటి : 2 | సంచిక : 196 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




### టీఎంసీ ఉన్నంతకాలం బెంగాల్‌లో

## మహిళలకు రక్షణ ఉండదు

- ◆ బెంగాల్‌లో మహిళలకు రక్షణ లేదని వ్యాఖ్య
- ◆ గూండాలకు టీఎంసీ అండగా ఉందని ఆరోపణ
- ◆ బీజేపీ గెలిస్తే "జంగిల్ రాజ్"కు ముగింపు అన్న హామీ
- ◆ మహిళల భద్రతపై చర్యలు తీసుకుంటామని భరోసా
- ◆ బాలికల అదృశ్యంపై టీఎంసీ నిర్లక్ష్యమని విమర్శ
- ◆ రైతులు, కార్మికుల సంక్షేమంపై బీజేపీ కృషి
- ◆ బెంగాల్ అభివృద్ధికి బీజేపీ అవసరమని వ్యాఖ్య

తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు బెంగాల్‌లో మహిళలకు రక్షణ ఉండదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామన్నారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తాం కాబట్టే ఆర్జీకర్ మృతురాలి తల్లికి తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల టికెట్ ఇచ్చామన్నారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామన్నారు. బంగావ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్న కేసులు నమోదు అవుతున్నాయని మోదీ పేర్కొన్నారు. అయినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతో పాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో భాజపా కృషి చేస్తోందన్నారు. అందుకే గత 11ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరల ను రెట్టింపు చేసిందన్నారు. గోధుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను తప్పనిసరి చేశామని వెల్లడించారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటన్నిటినీ మూసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామన్నారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనన్నారు.



ఆన్ లైన్ లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో పాల్గొన్న సీఎం రేవంత్..

## జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపు

**2027 జనగణన కోసం ఆన్‌లైన్ స్వీయ గణన ప్రారంభం**

- » సీఎం స్వయంగా వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు
- » జనగణనలో అందరూ పాల్గొనాలని పిలుపు
- » అధికారుల సమక్షంలో ప్రక్రియ వివరాలు
- » ప్రజల భాగస్వామ్యం కీలకమని వ్యాఖ్య

సీఎం రేవంత్ రెడ్డి సెల్ఫ్ ఎన్యుమరేషన్‌లో పాల్గొన్నారు. వెబ్ సైట్ లో స్వయంగా వివరాలను నమోదు చేసుకున్నారు. 2027 జనగణనలో భాగంగా తెలంగాణలో ఇవాళ (ఏప్రిల్ 26) నుంచి ఆన్‌లైన్‌లో స్వీయ గణన ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారుల సమక్షంలో సీఎం తన వివరాలను నమోదు చేసుకున్నారు.జనాభా లెక్కల కార్యక్రమంలో ముందుగా చేపట్టిన సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమానికి సంబంధించి సెన్సస్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జనగణనలో స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని గురించి చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. అత్యంత కీలకమైన జనగణన కార్యక్రమంలో ప్రజలంతా విశేషంగా పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ , జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక ఆల, సమాచార పౌర సంబంధాల కమిషనర్ సీహెచ్. ప్రియాంక తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం

- » రహదారి ఉన్న గ్రామాలన్నింటికీ బస్సు సౌకర్యం హామీ
- » ఇంకా సేవలు లేని గ్రామాలను గుర్తించి విస్తరణ
- » ప్రజలకు సమాన న్యాయం, మహిళాభివృద్ధిపై దృష్టి
- » ఎమ్మెల్యే Vamsi Krishna: ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు
- » డిండి డ్యాంలో త్వరలో బోటింగ్ ఏర్పాటు
- » డ్రైవర్‌పై దాడి ఘటనపై మంత్రి ఆగ్రహం
- » దాడి చేసిన వ్యక్తిపై కేసు, అరెస్ట్




**ఉప్పునుంతల,**
రాష్ట్ర వ్యాప్తంగా రహదారి సౌకర్యం ఉన్న ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సులను నడుపుతూ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపైన ఉప్పునుంతల మండల పరిధిలోని డిండికట్ట మైసమ్మ ఆలయ కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే డా.వంశీకృష్ణతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. దేవాలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించామన్నారు. ఇంకా బస్సులు వెళ్లని గ్రామాలను గుర్తించి బస్సుల్ని నడుపుతామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలందరికీ సమాన న్యాయం కల్పిస్తున్నామన్నారు. మహిళాభివృద్ధిని కోరి ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.

## తెలంగాణలో ప్రారంభమైన తొలి విడత జనగణన

**హైదరాబాద్:**
తెలంగాణలో తొలివిడత జనగణన ప్రారంభమైంది. గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మంత్రి పొన్నం ప్రభాకర్ సెల్ఫ్ ఎన్యూమరేషన్ (స్వీయ గణన) చేసుకున్నారు.




### హైడ్రాపై ఎమ్మెల్యే

## రాజాసింగ్ ధ్వజం

- » గోషామహల్‌లో డబ్బాలు తొలగింపుపై ఆగ్రహం
- » కోర్టు ఆర్డర్ ఉన్నా చర్యలపై విమర్శ
- » హైడ్రాకు సవాల్: అక్రమ కట్టడాలు కూల్చండి
- » పేదల ఉపాధిపై దెబ్బ అన్న ఆరోపణ
- » జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పై వ్యాఖ్యలు




**హైదరాబాద్:**
హైడ్రా, మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే రాజాసింగ్ ధ్వజమెత్తారు. గోషామహల్ నియోజకవర్గంలో ఫిష్ మార్కెట్ పక్కన ఉన్న డబ్బాలను తొలగించారని, తాను ఇక్కడ లేని సమయం చూసే వాటిని హైడ్రా తొలగించిందంటూ మండాపడ్డారు. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అధికారులు దౌర్జన్యంగా తొలగించారన్నారు. హైడ్రాకు దమ్ముంటే దారుసలాం, ఛార్మినార్ ముందు ఉన్న అక్రమ కట్టడాలు కూల్చి చూపెట్టాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల ఉపాధి అవకాశాలపై దౌర్జన్యం సరికాదని, త్వరలో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని విమర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు రాదన్నారు. రాష్ట్ర సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అంబేద్కర్ జయంతి వారోత్సవాల

## ముగింపు వేడుకలు

- » బీజేపీ ఆధ్వర్యంలో సోమాజిగూడలో భారీగా కార్యక్రమం
- » అంబేద్కర్‌ను "దేశానికి ఆశాజ్యోతి"గా పేర్కొన్న బండి సంజయ్
- » కాంగ్రెస్‌పై అంబేద్కర్ అవమానంపై విమర్శలు
- » మహిళా రిజర్వేషన్, బీసీల అంశాలపై కాంగ్రెస్‌పై విమర్శలు
- » మే 10న హైదరాబాద్‌కు ప్రధాని మోదీ రానున్నట్లు ప్రకటన
- » అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం, పబ్లిక్ మీటింగ్ నిర్వహణ

**హైదరాబాద్:**
బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని సోమాజిగూడలో జరిగిన అంబేద్కర్ జయంతి వారోత్సవాల ముగింపు వేడుకల్లో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు. ఈ వేడుకలకు భారీ ఎత్తున బీజేపీ నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. దీనిలో భాగంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'అంబేద్కర్ జయంతిని గల్లీ నుండి ఢిల్లీ వరకు ఇంకా నడుస్తూనే ఉన్నాయి. అంబేద్కర్ దేశ ప్రజలకి



ఆశా జ్యోతి.. అందుకే దేశ వ్యాప్తంగా వారోత్సవాలు జరగుతున్నాయి.రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా అంబేద్కర్ జయంతిని తూతూ మంత్రంగా జరుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని వారం రోజుల పాటు ప్రధాని మోదీ ఘనంగా నిర్వహిస్తున్నారు.

### 'రేవంత్ పేరు చెప్పాలంటేనే

## మొహం తిప్పుకుంటున్నారు'

- ▪ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి పిలుపు
- ▪ హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ బలంగా ఉందని వ్యాఖ్య
- ▪ గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారన్న ఆరోపణ
- ▪ సీఎం రేవంత్‌కు "ఐడెంటిటీ క్రైసిస్" ఉందని వ్యాఖ్య
- ▪ "రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు" అన్న వ్యాఖ్య
- ▪ కాంగ్రెస్ హామీలు అమలు కాలేదని విమర్శ



**హైదరాబాద్:**
దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం హుజూర్ నగర్ నియోజకవర్గం నుంచి పలువురు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో హుజూర్ నగర్‌లో భారీగా ఓట్లు వచ్చాయి. దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు అంతా ముందుకు వస్తున్నారు. హుజూర్‌నగర్‌లో గతంలో ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు మారలేదు.

మిగతాద్ది 2 లో



### ఖమ్మంలో తండ్రి, కుమార్తె

## అనుమానాస్పద మృతి

**ఖమ్మం:**
ఖమ్మం నగరం మామిళ్లగూడెంలో ఓ ఇంట్లో తండ్రి, కుమార్తె అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఇంట్లో రాము(35), పెద్ద కుమార్తె దివ్య(5) విగతజీవులుగా పడి ఉన్నారు. మరోవైపు ఇంట్లోనే అపస్మారక స్థితిలో ఉన్న భార్య, చిన్న కుమార్తెను గుర్తించి.. స్థానికులు ఆస్పత్రికి తరలించారు. భార్య రమ్య గడ్డి మందు తాగిందని వైద్యులు తెలిపారు. చిన్న కుమార్తె తలకు గాయాలున్నాయి. ఇంట్లో రక్తపు మరకలు ఉండటంతో.. ఇది ఆత్మహత్యా..? లేక హత్య అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రాము, రమ్య నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం వాసులు.

## జనగణన.. సంక్షేమ పథకాలు పోతాయనే భయం వద్దు: కిషన్‌రెడ్డి

- ▪ సంక్షేమ పథకాలు పోతాయనే భయం అవసరం లేదని స్పష్టం
- ▪ తొలిసారి కులగణన జరుగుతోందని వ్యాఖ్య
- ▪ ప్రజలు ధైర్యంగా వివరాలు ఇవ్వాలని పిలుపు
- ▪ ఎస్ఐఆర్‌తో నకిలీ ఓట్లు తగ్గుతాయని అభిప్రాయం
- ▪ హైదరాబాద్‌లో పోలింగ్ శాతం పెరుగుతుందని ఆశాభావం



## 'రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు'

మొదటిపేజీ తరువాయి
కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. హుజూర్ నగర్ నియోజకవర్గంలో అనామకుడైన సైదిరెడ్డిని గెలిపించాం.
2023 శాసన సభ ఎన్నికల్లో ఓడిపోగానే పార్టీని వదిలిపెట్టి పోయారు. హుజూర్ నగర్‌లో దుర్మార్గమైన కాంగ్రెస్ వైఖరీని బీఆర్ఎస్ శ్రేణులు పోరాట స్ఫూర్తితో ఎదుర్కొంటున్నారు. సైదిరెడ్డి ఆయన సొంత ఊరులో సర్పంచ్‌ని గెలిపించుకోలేక పోయారు. ఆనాడు జలదృశ్యంలో గులాబీ జెండా ఎగిరింది. తెలంగాణ రాష్ట్రంలో గులాబీ జెండా ఎగిరి 25 యేండ్లు పూర్తి చేసుకొని 26 వసంతంలోకి అడుగుపెడుతోంది. దేశంలో ఏ పార్టీకి లేని విశిష్టత ఒక్క బీఆర్ఎస్ పార్టీకే ఉంది.
సీఎం రేవంత్‌రెడ్డికి ఐడెంటిటీ క్రైసిస్ ఉంది.. అందుకే కేసీఆర్‌ను విమర్శిస్తున్నారు. ముఖ్యమంత్రి పేరును ఎవరూ గుర్తు పెట్టుకోవడం లేదు. రేవంత్ పేరు చెప్పాలంటేనే మొహం తిప్పుకుంటున్నారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది. ఒక్కొక్క కాంగ్రెస్ నేత కమల్‌హాసన్‌ను మించి యాక్టింగ్ చేస్తున్నారు. వంద రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామని నమ్మించారు. బాండ్లు పేపర్లు రాసి, దేవుడి మీద ఒట్టు వేశారు. 420హామీలు, 13 డిక్లరేషన్లు ఏమయ్యాయి?. మాటలు ఆకాశన్నంటాయి.. చేసింది మాత్రం సున్నా.. కాంగ్రెస్‌కు ఓటేసి తప్పు చేశామని నల్గొండ రైతులు చెబుతున్నారు'అని తెలిపారు.

## పల్లెపల్లెకు ఆర్టీసీ బస్సులు నడుపుతాం

మొదటిపేజీ తరువాయి
ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిని కాంక్షించి పాలకమండలి పనిచేయాల్సి ఉందన్నారు. దేవాలయ చరిత్రలో మొదటి పాలకమండలి ఇదే అన్నారు. రూ.10 కోట్లతో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో డిండి డ్యాంలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారిపైన ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు ఎడ్ల నరేష్‌యాదవ్, సభ్యులతో దేవాదాయ శాఖ అధికారి మదన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరావు, నాయకులు కట్టా అనంతరెడ్డి, నర్సింహరావు, జగత్‌రెడ్డి, సీహెచ్.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, కాశన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రైవర్‌పై దాడి.. స్పందించిన పొన్నం

బస్సు ఆపలేదని నల్గొండ వద్ద డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడి చేసిన ఘటనపై మంత్రి పొన్నం స్పందించారు. దీనిపై జిల్లా పోలీసు అధికారులతో మాట్లాడి విచారణకు ఆదేశించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటామన్నారు. డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## జనగణన.. సంక్షేమ పథకాలు పోతాయనే భయం వద్దు: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
ప్రజాస్వామ్య దేశంలో గొప్ప కార్యక్రమం జనాభా లెక్కల సేకరణ అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జనగణనలో భాగంగా ఆయన ఆదివారం స్వీయ ధ్రువీకరణ చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జనగణనలో తొలిసారి కులగణన జరుగుతోందన్నారు. వివరాలు చెప్తే సంక్షేమ పథకాలు తొలగిస్తారనే భయం వద్దన్నారు. అందరూ ధైర్యంతో వివరాలు ఇవ్వాలని కోరారు."ఎన్నికల కమిషన్ చేపట్టిన ఎస్ఐఆర్‌ను అభినందించాలి. దీని వల్ల నకిలీ ఓట్లు తగ్గించొచ్చు. నకిలీ ఓట్ల తొలగింపుతో పోలింగ్ పర్సంటేజ్ పెరిగింది. హైదరాబాద్‌లో పోలింగ్ పర్సంటేజ్ 50శాతం దాటడం లేదు. ఎస్ఐఆర్ పూర్తయితే ఇక్కడ కూడా పోలింగ్ పర్సంటేజ్ పెరుగుతుంది. తెలంగాణ పర్యటనకు రానున్న ప్రధాని మోదీ.. రైల్వే, జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు"అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## తెలంగాణలో ప్రారంభమైన తొలి విడత జనగణన

మొదటిపేజీ తరువాయి
అధికారుల సమక్షంలో మంత్రి పొన్నం జనగణన నమోదు చేసుకున్నారు. ప్రజలంతా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలని కోరారు. ప్రతి పౌరుడు తన కుటుంబ వివరాలను జనాభా లెక్కల్లో చూపెట్టాలన్నారు. దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండేలా సెల్ఫ్ ఎన్యూమరేషన్ జరగాలన్నారు.

## అంబేద్కర్ జయంతి వారోత్సవాల ముగింపు వేడుకలు

మొదటిపేజీ తరువాయి
ఐక్యరాజ్య సమితినే అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిస్తుంది. మనం సుఖ సంతోషాలతో జీవిస్తున్నాం అంటే అది అంబేద్కర్ పెట్టిన భిక్షనే. అంబేద్కర్ చరిత్రని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి. అడుగడుగునా అంబేద్కర్ ని అవమానించిన పార్టీ కాంగ్రెస్. డూప్లికేట్ గాంధీ కుటుంబ చరిత్రనే ప్రజలకి తెలియాలని కాంగ్రెస్ కుట్ర చేసింది.
దేశ విభజన, 370 ఆర్టికల్ ని వ్యతిరేకించిన వ్యక్తి అంబేద్కర్. నెహ్రూ ఆగడాలు, అరాచకాలు తట్టుకోలేక అంబేద్కర్ రాజీనామా చేసి బయటికి వచ్చారు. అంబేద్కర్ కి భారతరత్న ఇవ్వడానికి కాంగ్రెస్ ఒప్పుకోలేదు. అంబేద్కర్ రాజకీయ చరిత్ర లేకుండా చేసింది కాంగ్రెస్. అప్పట్లో జనసంఘ్ పార్టీ అంబేద్కర్‌కి ఎంఎల్సీ ఇచ్చి గౌరవించింది. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ స్మృతి వనం కట్టలేదు' అని విమర్శించారు.
కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'అంబేద్కర్ ఆలోచన విధానాలతో మోదీ ప్రభుత్వం ముందుకు వెళుతుంది. అంబేద్కర్ ఆలోచన విధానాలకి కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా వెన్ను పోటు పొడిచిందో ప్రజలోకి తీసుకెళ్లాలి. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ ఏ విధంగా అడ్డుకుందో అందరికీ తెలుసు. అసెంబ్లీ, పార్లమెంట్‌లకు గిరిజనులు, దళితులు, మహిళలని వెళ్ళకుండా కాంగ్రెస్ అడ్డుకుంది. సీట్లు పెంపు ద్వారా అందరూ లబ్ది పొందేవారు. దక్షిణ భారతదేశంకి అన్యాయం జరుగుతుందని రేవంత్ రెడ్డి, స్టాలిన్, రాహుల్ గాంధీ మాట్లాడారు. ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా ఒకే నిష్పత్తిలో సమాంతరంగా సీట్లు పెంచాలని మోదీ నిర్ణయం తీసుకున్నారు. రేవంత్ రెడ్డి, స్టాలిన్, రాహుల్ గాంధీ వల్ల దక్షిణాది రాష్ట్రాలకి అన్యాయం జరిగింది. కాంగ్రెస్ 50 ఏళ్ళు పాలించినపుడు ఏ రోజు కూడా బీసీలు గుర్తుకు రాలేదు' అని మండిపడ్డారు.
'వచ్చే నెల పదోవ తేదీన తెలంగాణకు ప్రధాని మోదీ వస్తున్నారు. మూడోసారి ప్రధాని అయిన తరువాత మొదటి సారి హైదరాబాద్‌కి మోదీ వస్తున్నారు. ప్రధాని మోదీ తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు జాతికి అంకితం చేస్తారు. వచ్చే నెల 10 వ తేదీ న పెరేడ్ గ్రౌండ్ లో నాలుగు గంటలకు ప్రధాని బహిరంగ సభలో పాల్గొంటారు'అని స్పష్టం చేశారు.

## జగనన్న లే ఔట్ పేరుతో భారీ అవినీతి నివాస యోగ్యం కాని భూములు కొని నొక్కేశారు

**– కర్రగ్రహారం లే ఔట్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు**

వైసీపీ హయాంలో జగనన్న లే అవుట్ పేరుతో భారీగా అవినీతికి పాల్పడ్డారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. నివాస యోగ్యం లేని, సముద్ర తీర భూములను కొనుగోలు చేసి పెద్దఎత్తున కమిషన్లు దండుకున్నారని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో నివాస యోగ్యం లేని స్థలాలను పేదలకు కేటాయించారని.. ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆగ్రహించారు. వైసీపీ హయాంలో మచిలీపట్నంలోని కరగ్రహారం గ్రామంలో జగనన్న కాలనీని ఏర్పాటు చేసింది. 300 ఎకరాల్లో జగనన్న లే అవుట్‌ను ఏర్పాటు చేసి 16వేల ఇళ్ల స్థలాలు కేటాయించింది. కనీస సౌకర్యాలు లేకపోవటంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్దిదారులు ముందుకు రావడం లేదన్నారు. శనివారం ఆ కాలనీలో పర్యటించి వసతులు, సౌకర్యాలను మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. సెంటు స్థలంలో నిర్మించిన ఇళ్లకు వెళ్లి లబ్దిదారులతో మంత్రి రవీంద్ర మాట్లాడారు. కనీస వసతులు లేవని మంత్రి వద్ద లబ్దిదారులు వాపోయారు. చౌడు భూములు కావడంతో పెద్ద మొత్తంలో నిర్మాణ వ్యయమైందని లబ్దిదారులు తెలిపారు. ఈ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు నిర్మాణాల కోసం ముందుకు రాకపోతే ఆ స్థలాలను వెంటనే రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జగన్ హయాంలో ఈ కాలనీని నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఇళ్ల నిర్మాణాల కోసం లబ్దిదారులు ముందుకు రాలేదని మంత్రి చెప్పుకొచ్చారు. రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కాలనీలో కనీస వసతుల కల్పనకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ కాలనీలో అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## హిమాయత్ సాగర్ లో విషాదం... ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి...



హిమాయత్ సాగర్ లో విషాదం చోటు చేసుకుంది. ఈత సరదా ఇద్దరు యువకుల ప్రాణాలు బలి తీసుకుంది. ఆదివారం ( ఏప్రిల్ 26 ) వీకెండ్ కావడంతో హైదరాబాద్ లోని టోలిచౌకి నుండి హిమాయత్ సాగర్ కు ఈత కోసం వెళ్లారు ముగ్గురు యువకులు. సరదాగా హిమాయత్ సాగర్ లో చేపలు పడుతూ నీటిలోకి దిగారు స్నేహితులు. ఈత కొడుతూ ఒక్కసారిగా నీటలో గలంతయ్యారు యువకులు.ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా..మరో యువకుడు ప్రాణలతో బయటపడ్డాడు.ఈ ఘటనతో యువకుల కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతులు టోలిచౌకి ప్రాంతానికి చెంది షేక్ సల్మాన్, షాబాజ్ గా గుర్తించారు. ఈ ఘటనలో సురక్షితంగా బయటపడ్డ మరో యువకుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## తెరాసే ఏర్పాటుతో భారాస నేతల వెన్నులో వణుకు




బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర సేన (తెరాసే) ఏర్పాటుతో భారాస నాయకుల వెన్నులో వణుకు పుట్టిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెరాసే రాష్ట్ర నాయకులు ఎల్.రూప్ సింగ్, రంగు నవీన్ ఆచారి, సయ్యద్ ఇస్మాయిల్, గొంగళ్ల రంజిత్ కుమార్, మంచాల వరలక్ష్మి, నరేశ్ ప్రజాపతి మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ పేరుతో కవిత పార్టీ పేరు ప్రకటించగానే భారాస అధికారిక సోషల్ మీడియాలో ఒరిజినల్, డూప్లికేట్ అంటూ పోస్టులు పెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
నవీన్ ఆచారి మాట్లాడుతూ.. టీఆర్ఎస్‌కు నిజమైన హక్కుదారు కవిత అని అన్నారు. భారాస వదిలేసిన తెలంగాణవాదాన్ని ఆమె భుజాన ఎత్తుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణవాదం లేదని చెప్పిన జీవన్ రెడ్డిని పార్టీలోకి తెచ్చుకొని ఏం సంకేతం ఇస్తున్నారని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ట్యాంక్ బండ్‌పై తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేకపోయారని అన్నారు. స్థలం కేటాయిస్తే జాగృతి నుంచి తామే విగ్రహం ఏర్పాటు చేయిస్తామని ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదన్నారు. రూప్ సింగ్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినప్పుడే తెలంగాణ సమాజం మిమ్మల్ని తిరస్కరించిందని అన్నారు.
గొంగళ్ల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వ పోరును వదిలేసి.. బీటీ బ్యాచ్‌ను పోగు చేసిందే భారాస నేతలని విమర్శించారు. 2009లో మహబూబ్‌నగర్ ఎంపీగా కేసీఆర్ గెలిచేందుకు కవితక్కనే కారణమని అన్నారు. సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ.. తెలంగాణవాదం ఎత్తుకొని టీఆర్ఎస్ పేరుతో కవిత ప్రజల ముందుకు రావడాన్ని కొంతమంది జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క ఉంటుందన్నారు. మంచాల వరలక్ష్మి మాట్లాడుతూ.. తెరాసే ఆవిర్భావాన్ని జీవన్‌రెడ్డి విమర్శించటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. నరేశ్ ప్రజాపతి మాట్లాడుతూ.. అసలు మీరు టీఆర్ఎస్సా, బీఆర్ఎస్సా ముందు చెప్పాలని ప్రశ్నించారు. కేటీఆర్ ఇన్‌స్టా అకౌంట్‌లో టీఆర్ఎస్ అని, ఎక్స్ అకౌంట్‌లో బీఆర్ఎస్ అని పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ వాదం, అస్తిత్వాన్ని రక్షించేది కవితక్క మాత్రమేనని అన్నారు.

## జగిత్యాల జిల్లాలో విషాదం... బావిలో ఈతకు వెళ్లి బాలుడు మృతి...

జగిత్యాల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. బావిలో ఈతకు వెళ్లి 13 ఏళ్ళ బాలుడు మృతి చెందాడు. ఆదివారం ( ఏప్రిల్ 26 ) జరిగిన ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లొత్తునూర్ గ్రామంలో చోటు చేసుకుంది ఈ విషాద ఘటన. వెల్గటూర్ మండలం బీర్సని గ్రామానికి చెందిన కాంపెల్లి రితేష్ అనే బాలుడు 7వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ కి సెలవులు, పైగా ఆదివారం కావడంతో లొత్తునూర్ గ్రామంలో ఫ్రెండ్స్ తో కలిసి వ్యవసాయ బావిలో ఈతకు వెళ్ళాడు రితేష్. బావిలో ఈత కొడుతూ ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందాడు.నలుగురు ఫ్రెండ్స్ తో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన రితేష్ ఈత రాకపోవడంతో మృతి చెందాడు. పెళ్లి వేడుకకు సమీపంలో ఉన్న బావిలోనే ఈ ఘటన జరగడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు ఇలా మృతి చెందడం చూసి తట్టుకోలేక కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది రితేష్ తల్లి. ఈ ఘటన చూసి గ్రామస్తులు సైతం చలించిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు

**పోలవరం ద్వారా గోదావరి జలాల తరలింపు**
**అనకాపల్లి పరిశ్రమలకు ఇదే ఆధారం**
**మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి**

ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చడంలో గోదావరి జలాలు ఎంతో కీలకమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేందుకు పోలవరం ఎడమ కాలువే ప్రధాన ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా గోదావరి జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కాకినాడ జిల్లా అన్నవరంలో పంపా ఆక్విడక్ట్ వద్ద పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను మంత్రి నిమ్మల పరిశీలించారు. ఆరెంపూడి, గవరయ్య కోనేరు గ్రామాల దగ్గర హైవే క్రాసింగ్ వంతెనల నిర్మాణ పనులనూ మంత్రి నిమ్మల పర్యవేక్షించారు. అనంతరం తుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పోలవరం ఎల్ఎంసీ పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష నిర్వహించారు. జూన్ నాటికి మొదటి దశ పనులు పూర్తి చేసి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.
నేషనల్ హైవేల క్రాసింగ్ దగ్గర వంతెనల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. పనులు ఆలస్యం చేస్తే ఉపేక్షించేది లేదని అధికారులు, ఏజెన్సీలను మంత్రి సున్నితంగా హెచ్చరించారు. ఉత్తరాంధ్రలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు గోదావరి జలాలు కీలకమన్నారు. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించడానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువే ఆధారమన్నారు. అనకాపల్లి కేంద్రంగా వస్తున్న భారీ పరిశ్రమలకు నీటి సమస్య లేకుండా ఈ నీటిని అందిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం ఎడమ కాలువ కోసం ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని మంత్రి నిమ్మల ఆరోపించారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులను ప్రీ క్లోజర్ చేసి ఉత్తరాంధ్ర ప్రజలపై జగన్ గత ప్రభుత్వం కక్ష్య కట్టిందని మండిపడ్డారు. పోలవరం ఎడమ కాలువ సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కుల నుంచి 8,122 క్యూసెక్కులకు తగ్గిస్తూ ఉత్తరాంధ్ర ప్రయోజనాలకు నాడు జగన్ గండికొట్టారని మంత్రి నిమ్మల ఆగ్రహించారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి ప్రాధాన్యతగా పోలవరం ప్రాజెక్టును సందర్శిస్తే, రెండో ప్రాధాన్యతగా లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం రూ.1,460 కోట్లు ఖర్చు చేసి జూన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్లేలా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి నిమ్మల పేర్కొన్నారు. ఇప్పటివరకూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు 76 శాతం పూర్తి చేశామన్నారు. కుమ్మరిలోవలోని 472 కుటుంబాలకు తమ ప్రభుత్వం రూ.30.38 కోట్ల పరిహారం అందించినట్లు వెల్లడించారు. పోలవరం ఎడమ కాలువ మొదటి నుంచి తుని వరకు ఉన్న 110 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండి 28,557 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పిఠాపురం అప్ టేక్ స్లూయిస్ నిర్మాణం పూర్తయితే 67,674 ఎకరాల ఏలేరు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని నిమ్మల తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ప్రవహించే మార్గమధ్యంలో ఉన్న 143 గ్రామాలకు చెందిన 5.23 లక్షల మంది జనాభాకు తాగునీటి సౌకర్యం లభిస్తుందన్నారు. పాయకారావుపేటకి ఎగువన ఉన్న 98 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నిండటం ద్వారా 48,368 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

## చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్'

**-ఎకనమిక్ టైమ్స్ అవార్డు అందచేత**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముంబై వేదికగా ప్రతిష్టాత్మకమైన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు. ప్రముఖ దినపత్రిక 'ఎకనమిక్ టైమ్స్' సీఎం దార్శనికతకు, పాలనా సంస్కరణలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.పరిశ్రమల స్థాపన, మౌలిక సదుపాయాల కల్పన, సులభతర వాణిజ్యంలో చంద్రబాబు చూపుతున్న చొరవను కొనియాడుతూ ఎకనమిక్ టైమ్స్ ఈ అవార్డును అందించింది. దేశ ఆర్థిక అభివృద్ధిలో ఏపీని కీలక భాగస్వామిగా మలిచినందుకు ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణం, పేదల సంక్షేమంపై ముఖ్యమంత్రి చేసిన కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదని, అది ప్రజా రాజధాని అని సీఎం అభివర్ణించారు. మరోసారి అమరావతిని నిర్మించే అవకాశం తనకు దక్కడం తన అదృష్టమని సీఎం వ్యాఖ్యానించారు. నవ్యాంధ్ర నిర్మాణంలో అమరావతి ఒక ప్రపంచ స్థాయి ఐకాన్‌గా నిలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణానికి కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, నిధుల పరంగా, మౌలిక సదుపాయాల పరంగా మద్దతు లభిస్తోందని వెల్లడించారు. పేదరికం నిర్మూలన కోసం పి-4 విధానాన్ని తీసుకువచ్చామని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు, ప్రజలు కలిసి పేదల అభ్యున్నతికి కృషి చేయడమే ఈ పి-4 లక్ష్యమని వ్యాఖ్యానించారు. సంపదను సృష్టించి, ఆ సంపదను తిరిగి పేదల సంక్షేమానికి మళ్లించేలా ఈ విధానం ఉండబోతుందని సీఎం వివరించారు. ముంబై పర్యటనలో చంద్రబాబుకు లభించిన ఈ గౌరవం ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల ఆకర్షణకు మరింత బలాన్ని చేకూర్చనుందని అధికారులు తెలిపారు. అమరావతిపై సీఎం వ్యక్తం చేసిన విశ్వాసం ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు.

## లిక్కర్ కేసులో సిట్ ముమ్మర దర్యాప్తు

**- హైదరాబాద్‌లో మాజీమంత్రి కారుమూరి విచారణ**

వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావును సిట్ అధికారులు శనివారం హైదరాబాద్‌లో విచారించారు. నాలుగు గంటల పాటు కారుమూరిని విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. కారుమూరిని ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు విచారించారు. మద్యం రవాణా టెండర్ల జారీలో కారుమూరి పాత్రపై సిట్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిట్ ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఏపీ లిక్కర్ స్కామ్‌లో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని విచారించామని తెలిపారు. ఆయన వయసు 60 సంవత్సరాలు పైనే ఉండటంతో చట్టప్రకారం ఆయన కోరిన చోటే విచారించామని వెల్లడించారు. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశామని సిట్ ఎస్పీ చెప్పుకొచ్చారు. విచారణకు ఆయన సహకరించారని.. అవసరమైతే మరోసారి విచారిస్తామని తెలిపారు. మద్యం రవాణా, టెండర్లు సబ్ కాంట్రాక్టుల అవకతవకల విషయంలో కారుమూరిపై, ఆయన కుమారుడిపై కేసు నమోదైందని చెప్పారు. మద్యం రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.200 నుంచి రూ. 250 కోట్ల వరకు గండి కొట్టినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయని అన్నారు. కారుమూరి కుమారుడు సునీల్‌ను సిట్ కార్యాలయంలోనే విచారిస్తామని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం సిట్ ముందు ఆయన కుమారుడు విచారణకు హాజరు కావాలని సూచించారు. అనారోగ్య కారణాలతో సునీల్ సమయం
కోరారని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిట్ ఎస్పీ పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 27, 2026

# రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం

కరపత్రం ప్రతినిది, వేములవాడ



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాల కోసం భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడకు చెందిన నీలగిరి శంకర్రావు,ప్రసూన దంపతులు రూ.10 లక్షల విరాళాన్ని ఆదివారం ఆలయ ఈవో కు అందజేశారు.

# బదిలీపై వెళ్తున్న సీఐ లక్ష్మీనారాయణకు ఘన సన్మానం

కరపత్రం ప్రతినిది జమ్మికుంట ఏప్రిల్ 26



జమ్మికుంట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ బదిలీపై వెళ్లుతున్న సందర్భంగా ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ ఇంగిలే రామారావు సీఐ లక్ష్మీనారాయణను శాలువాతో సత్కరించి, దేవుని చిత్రపటాన్ని బహుకరించారు. అలాగే శ్రీ రాముల వారి కళ్యాణానికి సంబంధించిన ముత్యాల తలంబ్రాలను కూడా అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన రామారావు, లక్ష్మీనారాయణ సీఐగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి జమ్మికుంట రూరల్ పరిధిలోని అనేక గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేలా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి ప్రజల్లో భద్రతాభావాన్ని పెంచారని తెలిపారు.ఇల్లందకుంటలో నిర్వహించిన శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో కూడా అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినందుకు ఆయన సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. అలాంటి సమర్థవంతమైన అధికారి బదిలీపై వెళ్లడం బాధాకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంట అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవ సంస్థాన్ ఆధ్వర్యంలో వాసవి మాత జయంతి వేడుకలు

కరపత్రం ప్రతినిది, ఇల్లందకుంట ఏప్రిల్ 26



ఇల్లందకుంటలో భక్తి శ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు ప్రభుత్వ గుర్తింపుకు కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్య సేవా సంస్థాన్ కమిటీ తేదీ 26-04-2026, ఆదివారం రోజున ఇల్లంతకుంటలోని ఆర్యవైశ్య సేవా సంస్థాన్ నిత్యాన్న సత్రంలో శ్రీ వాసవి మాత జయంతి సందర్భంగా భక్తి శ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు, ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి పారాయణము నిర్వహించారు ఈ సందర్భంగా సంస్థాన్ లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా గుర్తిస్తూ గెజిట్ విడుదల చేయడం పట్ల ఆర్యవైశ్య సమాజంలో హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ జయంతి ఉత్సవాలు నిర్వహించబడడం విశేషంగా నిలిచింది. ఈ నిర్ణయం ద్వారా వాసవి మాత సేవలు, ఆర్యవైశ్య సమాజ చరిత్రకు తగిన గౌరవం లభించిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ నిత్యాన్న సత్రం కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. సమాజ అభివృద్ధి, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు, ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ ఆర్యవైశ్య సేవా సంస్థాన్ నిత్యాన్న సత్రం కమిటీ సభ్యులు, ఇల్లంతకుంట వాసవి క్లబ్ సభ్యులు, వాసవి వనిత క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, భక్తులు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# రామడుగు మండలం వన్నారం పోచమ్మ బోనాల ఉత్సవానికి హాజరైన మేయర్

కరపత్రం ప్రతినిది కరీంనగర్ ఏప్రిల్ 26



రామడుగు మండలం వన్నారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోచమ్మ బోనాల ఉత్సవానికి కరీంనగర్ మేయర్ కోలాగని శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ బోనాల పండుగ అనేది హిందువుల పురాతన ఆచారం అని పాడి పంటలు బాగుండాలని, ప్రజలు ఆరోగ్యం గా సుఖ సంతోషం తో ఉండాలని దేవుళ్ళకు బోనాల చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, బీజేపీ రామడుగు మండలం అధ్యక్షులు, తిర్మలాపూర్ గ్రామ సర్పంచ్ మోడీ రవీందర్, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్ రెడ్డి,గుంట అశోక్, శేవ్వాళ్ళ అక్షయ్, కొండ్రా శ్రీనివాస్, గ్రామం ఉపసర్పంచ్ బండారు లక్ష్మణ్, కొక్కెరకుంట ఉపసర్పంచ్ వేముండ్ల కుమార్, దయ్యాలా రాజు, బత్తిని శంకర్, దర్శనలా రాము, జాడి వంశీ, వరాల శ్రీనివాస్, వరాల మహిపాల్, వరాల అనిల్, గుర్తురి రమేష్, గోళ్ళ శ్రీనివాస్, కారం రవి ప్రసాద్, గజ్జెల రమేష్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు వరాల రాము గారు, వరాల కనకయ్య, సంఘం ప్రతినిధులు, పెద్దమనుషులు, మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో 70 ఎకరాల్లో మొక్కజొన్న దగ్ధం

- రైతులకు భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

కరపత్రం ప్రతినిది మొగుళ్లపల్లి ఏప్రిల్ 26





మొగుళ్ళపల్లి మండలంలోని గణేష్‌పల్లి, పెదకోమటిపల్లి గ్రామాల్లో జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా మొక్కజొన్న పంట దగ్ధమైంది. ఈ ఘటనపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంఘటనా స్థలాన్ని సందర్శించి రైతుల పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గణేష్‌పల్లి, పెదకోమటిపల్లి గ్రామాలకు చెందిన 17 మంది రైతుల సుమారు 70 ఎకరాల మొక్కజొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. గత సంవత్సరం కూడా ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ లోపంతో ఇలాంటి ప్రమాదం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు.విద్యుత్ శాఖకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని తెలిపారు.గణేష్‌పల్లి సర్పంచ్ సమాచారం అందుకున్న వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. సీఎండీ వరుణ్ రెడ్డితో మాట్లాడగా వెంటనే సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కూడా మాట్లాడినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ స్వయంగా ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని అంచనా వేస్తారని, వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని లెక్కించి రైతుల వివరాలు నమోదు చేస్తారని వెల్లడించారు.దగ్ధమైన మొక్కజొన్న కంకులను కొనుగోలు చేయించే విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కూడా చర్చించినట్లు తెలిపారు. రైతులకు వీలైనంత త్వరగా నష్టం తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.ఇప్పటికే రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుంటున్నారని, కలెక్టర్ పరిశీలన అనంతరం తక్షణమే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ ఘటనలో నోటికొచ్చిన పంట కోల్పోవడం బాధాకరమని, రైతులు ధైర్యంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# వాసవి మాత ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

కరపత్రం ప్రతినిది, వేములవాడ



వాసవి మాత ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య సత్రంలో సత్రం అధ్యక్షులు బుస్స శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవి మాత జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వాసవి మాత త్యాగం, అహింసా సిద్ధాంతం సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఆమె చూపించిన ధర్మమార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాల్సినదిగా పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సహనం, పరస్పర గౌరవం పెంపొందించడమే వాసవి మాత ఆశయాల సారమని ఆయన తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ నరాల శేఖర్ తో పాటు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పిట్టల మనోహర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాను కృష్ణ, సంయుక్త కార్యదర్శి కనికరపు శ్రీనివాస్, కోశాధికారి జెట్టి శేఖర్, సీనియర్ ఈసీ సభ్యులు కటకం జనార్దన్ ను ఆర్యవైశ్య సత్రం ప్రతినిధులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్రం జాయింట్ సెక్రెటరీ కట్కూరి శ్రీనివాస్, సత్రం ఆడిట్ కమిటీ చైర్మన్ చీకోటి శ్రీహరి, సత్రం ఫుడ్ కమిటీ చైర్మన్ బుస్స దశరథం, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సిద్ధం శెట్టి వేణు, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మ నటరాజ్, పట్టణ ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త అనిల్, ఆర్యవైశ్య నాయకులు సకినాల అశోక్ ,చికోటి అశోక్, దెబ్బేటి శ్రీనివాస్, కొమ్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూధర్మం అంటే మతం కాదు, జీవన విధానం.

- ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ

కరపత్రం ప్రతినిది కరీంనగర్ ఏప్రిల్ 26






హిందూధర్మం అంటే మతం కాదు, జీవన విధానం అని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ అన్నారు. మానకొండూర్ ఉప మండలం ,శ్రీరామ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ ప్రోగ్రాంకు
ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందల సత్యనారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మం , సనాతన ధర్మం కు శాశ్వత చిరునామా భారతదేశమే అన్నారు. అందుకే ప్రపంచ దేశాల్లో అన్నింటికంటే భారత దేశానికి ఓ ప్రత్యేకత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ సంస్కృతి సంప్రదాయాలుకాపాడుకోవాలన్నారు. దేశ ప్రగతికి సత్యం, ధర్మం వంటి విలువలను ఆచరించడం అవసరమని తెలిపారు. పంచ పరివర్తనల ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని , ఆ దిశగా ముందుకు కొనసాగాలని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. హిందూ సమాజం ఐక్యత తో ఉండాలన్నారు. హిందూ ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి నడుం బిగించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హిందూ సమ్మేళన సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హిందూ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ అల్పాహారం, మజ్జిగ ను అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు సరఫ్ రామకృష్ణ , గర్రెపల్లిమహేశ్వర శర్మ అయ్యగారు , మహిళా వక్త అనుపమ లతో పాటు సదాశివ పల్లి, మానకొండూర్ , ముంజంపల్లి, శ్రీనివాస్ నగర్, జగ్గయ్యపల్లి, లింగాపూర్, ఈదులగట్టపల్లి,గ్రామాల హిందూ బంధువులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు

కరపత్రం ప్రతినిది జమ్మికుంట: ఏప్రిల్ 26





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న సందర్భంగా జమ్మికుంట పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక దేవాలయంలో జరిగిన ప్రత్యేక పూజలు, హోమాలలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని అమ్మవారికి పట్టు చీరలు సమర్పించారు.అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాసవీ జయంతి వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం మాత్రమే కాకుండా సమాజానికి మార్గదర్శకురాలని పేర్కొన్నారు. కోమట్ల ఇంట పుట్టిన ఆడబిడ్డగా ఆమె చూపిన ధైర్యం, త్యాగం, అహింసా మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు.అమ్మవారు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధర్మం నెలకొల్పేందుకు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, జమ్మికుంట పట్టణ ప్రజలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారి ఆశయాలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆమె ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సమాజ సేవలో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బచ్చు మాధవి శివశంకర్, చందరాజు, స్వామిశెట్టి అఖిలాండం రాజేందర్, ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి భక్తులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించిన ఈ వేడుకలు పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.ఈ సందర్భంగా నిర్వహించిన పూజలు, కార్యక్రమాలు వాసవీ మాత ఆశయాలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో ఐక్యత, సేవాభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాయి

# అమిత్ షాపై లీగల్ కేసు వేస్తాం

## బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రకటన

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ప్రచారంలో రాజకీయ ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన హింసాత్మక వ్యాఖ్యలపై లీగల్ కేసు వేయనున్నట్టు పశ్చిమబెంగాల్ మమతా బెనర్జీ తెలిపారు. హుగ్లీలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికలు ముగిసిన తర్వాత టీఎంసీ కార్యకర్తలను 'తలకిందులుగా వేలాడదీస్తాం' అంటూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఒక హోం మంత్రి స్థాయికి తగవని, ఇలాంటి దురుసు పోగడలతో బెంగాల్ ఓటర్ల మనసులు గెలుచుకోలేరని అన్నారు. ఎన్నికల తర్వాత జనాలను తలకిందులుగా వేలాడదీస్తామంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలాంటి మైండ్‌సెట్ ఉన్న వాళ్లు బెంగాల్‌లో ఎప్పటికీ గెలవలేరు' అని మమత అన్నారు. ఆరంబాగ్‌లో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, 29న ఆరాంబాగ్ ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే మే 5వ తర్వాత వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. 'దీదీ గూండాలను నేను హెచ్చరిస్తున్నాను. 29న ఇళ్ల నుంచి బయటకు రాకండి. 29న ఆరంబాగ్ ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే తలకిందులుగా వేలాడదీసి దారిలో పెడతాం' అని అన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తుది విడత పోలింగ్ ఈనెల 29న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**కరపత్రం ప్రతినిది ఏప్రిల్ 26**

రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, దళారులను నమ్మి మోసపోవద్దని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించి రైతులు మద్దతు ధరను పొందాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా గన్ని బ్యాగులు తక్షణమే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజకీయ పరిణామాలపై కూడా ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై మాట్లాడుతూ, అది స్వతంత్ర పార్టీ కాదని, "కేసీఆర్ విసిరిన బాణమే కవిత" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత పదిహేనేళ్లుగా దోచుకున్న సొమ్మును ఎలా పంచుకోవాలనే విషయంలో వచ్చిన విభేదాల వల్లే బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి కొత్త పార్టీలు పెడుతున్నారని ఆయన విమర్శించారు. కవిత ఏర్పాటు చేసిన పార్టీ కూడా కేసీఆర్ వ్యూహంలో భాగమేనని, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే ఈ కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో భారీగా కూడబెట్టిన అక్రమ సంపాదన పంపకాలపై వచ్చిన మనస్పర్థల వల్లే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా పాలనకు ప్రజల నుంచి పూర్తి స్థాయి ఆదరణ లభిస్తోందని, అందువల్లే బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోయి నామరూపాలు లేకుండా పోయిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పారదర్శక పాలనను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు ఇలాంటి రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఇక బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఓ నీరజ, సొసైటీ ఇంచార్జ్ కీరునాయక్, మున్సిపల్ ఛైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మార్కెట్ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, కమిషనర్ జోనా, తహశీల్దార్ విజయసాగర్, వైస్ ఛైర్ పర్సన్ శిభారాణి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజీ రెడ్డి,పి.ఏ.సి.ఎస్ మాజీ ఛైర్మన్ రాజేష్ ఖన్నా,కౌన్సిలర్స్ పాపారావు,కమిలి భీమా నాయక్,తుమ్మల అరుణ,రమ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్రెడిటేషన్ కమిటీ సభ్యుల ఎంపిక





**కరపత్రం ప్రతినిది /వరంగల్, ఏప్రిల్ 26**

తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అక్రెడిటేషన్ కమిటీకి సభ్యులను ఎంపిక చేశారు.రాష్ట్ర అధ్యక్షులు మజీద్ సాహెబ్,జనరల్ సెక్రటరీ గౌస్ మొహినుద్దీన్ సాహెబ్ నాయకత్వంలో, రాష్ట్ర కమిటీ సహకారంతో ఈ ఎంపిక ప్రక్రియ పూర్తయింది.ఈ సందర్భంగా హన్మకొండకు చెందిన వరంగల్ కమిటీ జనరల్ సెక్రటరీ ఎం.ఏ.నయీమ్ సాహెబ్,ములుగు జిల్లాకు చెందిన గఫ్ఫార్ సాహెబ్ అక్రెడిటేషన్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.ఎంపికైన సభ్యులను ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ సాజిద్ పాషా,కోశాధికారి మొహమ్మద్ అమీర్ ఖాన్, సలహాదారులు వహీద్ గుల్షన్,ఎస్.ఎం.సయీద్,ఇస్మాయిల్ జాబి తదితరులు హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన సభ్యులు తమ కర్తవ్యాలను సమర్థవంతంగా నిర్వహించి జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు.

# వాసవి కన్యక పరమేశ్వరి జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కరపత్రం ప్రతినిది బ్యూరో:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాజులరామారం-షాపూర్ నగర్ ఆర్యవైశ్య అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో లోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యక పరమేశ్వరి జయంతి సందర్భంగా ఈరోజు ఆర్యవైశ్య అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు ఈరోజు స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ హాజరై ఆ వాసవి మాత ఆలయం లో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ఆర్యవైశ్యులలో ఉద్దేశించి మాట్లాడుతూ ఆ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి ఆశీస్సులు, దీవెనలు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు, ఇంత గొప్పగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సోదరులందరికీ అభినందించారు.అనంతరం ఆర్యవైశ్య అసోసియేషన్ సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అసోసియేషన్ అధ్యక్షులు పవన్ గుప్తా, హర్ష, జగదీష్,వాస శ్రీనివాస్, ఆకుల ప్రభాకర్ ఇతర సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల సృజనాత్మకతే దేశ భవిష్యత్తు

- రవీంద్రభారతిలో యూనిఫైడ్ కౌన్సిల్ అవార్డ్స్‌లో ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్
- మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్







**కరపత్రం ప్రతినిది చీఫ్ బ్యూరో, ఏప్రిల్ 26**

విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచనా శక్తి, పరిశోధనా దృక్పథమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో నిర్వహించిన యూనిఫైడ్ కౌన్సిల్ అవార్డ్స్ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఒలింపియాడ్ పరీక్షల ద్వారా దాదాపు 10 లక్షల మంది విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీస్తున్న యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వాహకులను అభినందించారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందని, విద్యార్థుల మేధస్సుతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు విద్య బాలురకే పరిమితమై ఉండేదని, కానీ సావిత్రిబాయి పూలే వంటి మహనీయుల కృషితో అమ్మాయిలు కూడా విద్యను అందిపుచ్చుకుంటున్నారని అన్నారు. రీసెర్చ్, ఇన్నోవేషన్ వైపు దృష్టి పెట్టకపోతే దేశం ముందుకు సాగదని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం నాలుగో స్థానంలో నిలిచి వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని మూడో స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు విద్యలో మార్కులకే ప్రాధాన్యం ఉండేదని, కానీ కేవలం బట్టిపట్టే చదువు కాకుండా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందించే విధంగా ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

దేశంలోని అనేక సమస్యలకు పరిష్కారం పిల్లల ఆలోచనల్లోనే ఉందని, అందుకే తల్లిదండ్రులు పిల్లలను సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. టెక్నాలజీ అభివృద్ధి ప్రజల సంక్షేమానికి ఉపయోగపడాలని, మన సంస్కృతి "సర్వేజనా సుఖినోభవంతు" అనే సందేశాన్ని ప్రపంచానికి ఇస్తుందని అన్నారు. ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధాలు జరిగినా వాటి ప్రభావం అందరిపైనా పడుతుందని పేర్కొన్నారు. వంద మార్కులు సాధించడం గొప్ప విషయం కాదని, సంస్కారంతో ఎదగడం గొప్ప విషయమని అన్నారు. చదువుతో పాటు విలువలను కూడా పిల్లలకు నేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థుల ఎదుగుదలలో కుటుంబం కీలకమైతే, కుటుంబాల ఎదుగుదలలో దేశ అభివృద్ధి దాగి ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# డా. గాయత్రీ పాలాట్ కు యుద్ధవీర్ స్మారక పురస్కారం



**కరపత్రం ప్రతినిది హైదరాబాద్, ఏప్రిల్ 26**

యుద్ధవీర్ ఫౌండేషన్ 33వ స్మారక పురస్కారం కోసం డా. గాయత్రీ పాలాట్ ను ఎంపిక చేయడం జరిగింది. పాలియేటివ్ కేర్ రంగంలో ఆమె చేసిన విశిష్ట సేవలు, మానవ బాధలను తగ్గించడంలో ఆమె చూపిన అసాధారణ నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా ఏప్రిల్ 30న గురువారం సాయంత్రం 4:30 గంటలకు హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో ఉన్న కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియం లో ఈ అవార్డును అందజేస్తారు. ఈ పురస్కారం కింద ఒక ప్రశంసా పత్రం, ఒక లక్ష రూపాయల నగదు బహుమతి ఉంటాయి. కేరళలో జన్మించిన డా. గాయత్రీ పాలాట్ ది సైనిక కుటుంబం. దానితో ఆమె దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగారు. ఆమె మన దేశంలో చదువుకుని అనస్థీషియాలజీ డిప్లొమా, డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ పొందారు. అలాగే యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్ డియాగో నుండి ఇంటర్నేషనల్ ప్యాలియేటివ్ కేర్ లీడర్‌షిప్‌లో డిప్లొమా పొందారు. కొచ్చిలోని అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పాలియేటివ్ మెడిసిన్ విభాగం, దేశంలో మొదటిసారిగా ప్రారంభమైన పాలియేటివ్ మెడిసిన్ డిప్లొమా అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఆమె 2006లో మెహెదీ నవాజ్ జంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజినల్ క్యాన్సర్ సెంటర్, హైదరాబాద్ కి పెయిన్, పాలియేటివ్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా వచ్చారు. అక్కడ పాలియేటివ్ మెడిసిన్ విభాగం స్థాపనలో మరియు రాష్ట్ర ఆరోగ్య విధానంలో పాలియేటివ్ కేర్ ను చేర్చడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. 2019లో నిలోఫర్ ఆసుపత్రిలో పీడియాట్రిక్ పాలియేటివ్ కేర్ విభాగాన్ని స్థాపించడంలో, 2017 నుంచి 2022 వరకు తెలంగాణ లోని 33 జిల్లాల్లో పాలియేటివ్ కేర్ విభాగాలను ఏర్పాటు చేయడంలో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. అలాగే తెలంగాణలో ఓపియాయిడ్ నియంత్రణ సంస్కరణలను ప్రోత్సహించడం ద్వారా విధాన రూపకల్పన, సేవల ప్రాప్తి విస్తరణలో ఆమె కీలక పాత్ర పోషించారు. దీనితో పాటు 2021లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా ఎంఎన్ జే లో మూడు సంవత్సరాల ఎండీ, డీఎన్ బీ పాలియేటివ్ మెడిసిన్ ప్రోగ్రామ్‌లకు గుర్తింపు సాధించడంలో ఆమె ముఖ్య పాత్ర పోషించారు. గతంలో యుద్ధవీర్ స్మారక పురస్కారం పొందిన వారిలో భారత మాజీ ప్రధాన మంత్రి డా. మన్మోహన్ సింగ్, బి.పి.ఆర్. విఠల్, డా. యు.ఆర్. రావు, డా. సోమ రాజు, డా. కె. అంజి రెడ్డి , రామోజీ రావు , డా. జయప్రకాశ్ నారాయణ , పండిట్ జస్రాజ్ , ప్రొఫెసర్ శాంతా సిన్హా , సైనా నెహ్వాల్, డా. ఎవిటా ఫెర్నాండెజ్, డా. గుల్లపల్లి ఎన్ రావు తదితరులు ఉన్నారు. అలాగే ప్రతి సంవత్సరం యుద్ధవీర్ ఫౌండేషన్ తరపున ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం మాస్టర్స్‌లో ఉత్తమ విద్యార్థికి 'యుద్ధవీర్ గోల్డ్ మెడల్'ను కూడా అందజేస్తున్నారు. ఇదికాకుండా ముషీరాబాద్ లోని మదర్ కృష్ణ బాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో ఉత్తమ విద్యార్థికి కూడా ప్రతి సంవత్సరం 'యుద్ధవీర్ గోల్డ్ మెడల్'ను అందజేస్తున్నారు.

దివంగత యుద్ధవీర్ ప్రసిద్ధ జర్నలిస్ట్, అంకితభావంతో పని చేసిన సామాజిక సేవకుడు, ప్రకృతి ప్రేమికుడు. అయితే, ఆయన ఎక్కువగా గుర్తుంచుకోవాలని కోరుకున్న పాత్ర స్వాతంత్ర్య సమర యోధుడిగా ఉండటమే. ఆయన జీవితం, కృషిని గుర్తు చేసుకునేందుకు 1991 ఏప్రిల్ 10న యుద్ధవీర్ ఫౌండేషన్ స్థాపించబడింది. ఈ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం ఆయన ఉన్నత ఆదర్శాలను వ్యాప్తి చేయడం, జాతీయ ఐక్యత, సామాజిక సేవ, సంస్కృతి, సాహిత్యం, మానవ సేవ రంగాలలో కృషి చేసే వారిని గౌరవించడం. యుద్ధవీర్ ఫౌండేషన్ ట్రస్టీలు – అరుణ బహుగుణ (ఐపిఎస్ రిటైర్డ్) ఛైర్‌పర్సన్, అమర్ అలీ ఖాన్, తరుణ్ కుమార్ జవార్, నితిన్ బజాజ్, విష్మా వీర్ (కార్యదర్శి) నేతృత్వంలో ప్రతి ఏటా ఈ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు.

# ఇంధన కొరత నివారణకు వెంటనే చర్యలు తీసుకోండి

» అధికారులకు ఎంపీ రవిచంద్ర ఆదేశం



**కరపత్రం ప్రతినిది చీఫ్ బ్యూరో, ఏప్రిల్ 26**

తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా నెలకొనడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కొరతను వెంటనే నివారించాల్సిందిగా భారత్, హిందుస్థాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్స్ ఉన్నతాధికారులను పెట్రోలియం పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు,ఎంపీ రవిచంద్ర కోరారు.తాను హైదరాబాద్ నుంచి హన్మకొండకు ఆదివారం వెడుతున్న సందర్భంగా వాహనదారులు బంకుల వద్ద బారులు తీరి ఉండడాన్ని గమనించానని ఫోన్ చేసి అధికారులకు వివరించారు.పెట్రోల్, డీజిల్ కొరతను వెంటనే అరికట్టేందుకు అవసరమైన తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఎంపీ వద్దిరాజు కోరడంతో సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించారు.

# క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ పోటీలు..

» సుల్తానాబాద్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభించిన విప్, ఎమ్మెల్యే విజయరమణారావు.




**కరపత్రం ప్రతినిది బ్యూరో:**

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.ఆదివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కీర్తిశేషులు అల్లాడి అరవిందరావు స్మారక అర్థం సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఎస్.పి.ఎల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాలలో వేసవి సమయంలో యువత పెడదోవ పట్టవద్దనే సంకల్పంతో యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల తరహాలో (8) టీములు వేలం ద్వారా ఎన్నుకోబడి పోటీలలో పాల్గొంటారని అన్నారు.ప్రతి ఒక్క టీం (7) మ్యాచులు ఐ.పీ.ఎల్.తరహాలో ఆడతయన్నారు.గెలుపొందిన క్రీడాకారులకు గర్రెపల్లి సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి సందీప్ రావు ప్రథమ బహుమతి లక్ష రూపాయలు,ద్వితీయ బహుమతి 50 వేల రూపాయలు తోపాటు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ క్రీడలు కొనసాగడం శుభ పరిణామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ,మున్సిపల్ కౌన్సిలర్లు,కమిషనర్ టి.రమేష్, మాజి ఎంపీటీసీ సూర శ్యామ్,తాళ్లపల్లి మనోజ్ గౌడ్, నిర్వాహకులు సంజీవ్,క్రాంతి, వేముల అనిల్,సతీష్,సిద్ధా తిరుపతి,లతోపాటు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వన్నారం గ్రామ మున్నూరుకాపు కులస్తుల పోచమ్మ బోనాలు

**కరపత్రం ప్రతినిది కరీంనగర్, ఏప్రిల్ 26**



రామడుగు మండలం వన్నారం గ్రామంలో మున్నూరు కాపు కులస్తులు పోచమ్మ బోనాల సందడిలో వన్నార గ్రామంలో అట్ట సంఘ బోనాల పండుగను జరుపుకున్నారు ముఖ్య అతిథులుగా నగరపాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనువాస్ పాల్గొన్నారు. బిజెపి నాయకులు ఉపసర్పంచ్ బండారి లక్ష్మణ్ స్వాగతం పలుకుతూ.. గ్రామస్తులతో కలిసి శాలువా పూల బొకే తో సత్కరించారు. గ్రామంలో జరుగుతున్న పోచమ్మ బోనాలకు హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్, వన్నారం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని, మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన పోచమ్మ బోనాలలో పాల్గొన్న వన్నారం ఉపసర్పంచ్ బండారి లక్ష్మణ్, బిజెపి మండల అధ్యక్షులు మేడి రవీందర్, సీనియర్ నాయకులు మేకల ప్రభాకర్ యాదవ్ ,అక్షయ్ జాడి, వంశీ, కుమార్, వేముల, రాజు తదితరులు పాల్గొన్నారు.